

పెండింగ్‌లోనే కరీంనగర్

మూడో జాబితాలోనూ అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్ అధిష్ఠానం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ కరీంనగర్ అభ్యర్థిపై ఉత్కంఠ కొనసాగుతోంది. బుధ, గురువారాల్లో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన ఐదు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి నియోజకవర్గానికి గడ్డం వంశీకృష్ణను అభ్యర్థిగా ఖరారు చేసింది. కరీంనగర్, నిజామాబాద్ అభ్యర్థుల ఎంపికను పెండింగ్‌లో పెట్టింది.

● సామాజిక వర్గాలే కీలకం

కరీంనగర్ స్థానం నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, రుద్ర సంతోష్‌కుమార్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. ఇక్కడ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును ఖరారు చేసినా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించే సీట్లు ఎక్కువవుతున్నాయనే కారణంగా పెండింగ్‌లో ఉంచారని సమాచారం. వెలమ సామాజికవర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించని నేపథ్యంలో వెలిచాల రాజేందర్‌రావు పేరు ప్రధాన పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. బీసీ సామాజిక వర్గానికి చెందిన రుద్ర సంతోష్‌కు సీటు ఇవ్వాలని ఆ సామాజిక వర్గం నేతలు డిమాండ్ చేస్తుండడంతో అధిష్ఠానం ఇంకా ఏమి తేల్చుకోలేక ఎంపిక వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలు అంతర్భాగమై ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ స్థానం అభ్యర్థి ఎంపిక కూడా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి జిల్లాకే చెందిన ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు.

నిబంధనలు పాటించని

ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కరీంనగర్ టౌన్, మార్చి 21: పదో తరగతి వార్షిక పరీక్షల విధుల్లో నిబంధనలను పాటించని ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఇన్విజిలేటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, అక్కడక్కడ పరీక్షా విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం జరిగిన ద్వితీయ భాష పరీక్షకు 12,536 మంది హాజరుకావలసి ఉండగా 12,524 మంది పరీక్షలు రాశారని, 12 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ప్రైవేట్‌గా పరీక్షలు రాస్తున్న 33 మంది విద్యార్థుల్లో 18 మంది గైర్హాజరుకాగా 15 మంది పరీక్ష రాశారని అన్నారు.

జిల్లాలో 77 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 26 పరీక్షా కేంద్రాలను ప్రత్యేక తనిఖీ బృందాలు, నాలుగు పరీక్షా కేంద్రాలను పరీక్షల విభాగం సహాయ కమిషనర్, ఆరు కేంద్రాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేశామని చెప్పారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ మండలంలోని శాతవాహన హైస్కూల్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌ను విధుల నుంచి తొలగించామని, ఒక పరీక్షా కేంద్రంలో ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఇన్విజిలేటర్లు ఐడీ కార్డులు ధరించకుండా, ఒక సీఆర్‌పీ అనుమతి లేకుండా పరీక్షా కేంద్రాల్లో విధులకు హాజరైనందున వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు.

సమస్యాత్మక ప్రాంతాలపై

ప్రత్యేక నిఘా పెట్టాలి

సీపీ అభిషేక్ మొహంతి



చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

చొప్పదండి, మార్చి 21: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. గురువారం చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులంతా నిజాయితీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అధికారులంతా సమష్టిగా పనిచేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రకాష్‌గౌడ్, ఎస్ఐ ఉపేందర్‌చారి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం

● యూనిసెఫ్ సహకారంతో మరింత మెరుగ్గా పారిశుధ్యం ● కలెక్టర్ పమేలా సత్పతి



వంటల పోటీలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే ప్రధాన లక్ష్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో యూనిసెఫ్ కార్యక్రమాలపై ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిసెఫ్ సహకారంతో మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పారిశుధ్య కార్మికుల భద్రత కోసం బీమా కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. యూనిసెఫ్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసే అంశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీల్లో తడి, పొడి చెత్త వేరు చేసే అంశంపై యూనిసెస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామన్నారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలికలకు భద్రత కల్పించడంతో పాటు ఆత్మస్థయిర్యం పెంచేలా ప్రభుత్వ పాఠశాలల్లో స్నేహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, యూనిసెఫ్ ఢిల్లీ ప్రతినిధి కౌశికి బెనర్జీ, వాష్ స్పెషలిస్ట్ అరలికట్టి వెంకటేశ్, సీపీవో మురళీకృష్ణ, కొండవీటి పణీంద్ర, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, యూనిసెఫ్ సమన్వ య కర్త కిషన్‌స్వామి, డీసీపీవో శాంత, సఖి అడ్మిని స్ట్రేటర్ లక్ష్మి, రోహిణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● న్యూట్రిషన్, హెల్తీఫుడ్‌కు ప్రాధాన్యమివ్వండి

కరీంనగర్ టౌన్: బయట లభించే ఆహారపదార్థాలను తగ్గించుకుని ఇంట్లో తయారు చేసుకున్న న్యూట్రిషన్, హెల్తీఫుడ్‌కు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బయట లభించే జంక్‌ఫుడ్‌ను తీసుకోవడం వల్ల అనేక అనర్థాలు ఉంటాయని, ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పురుషులకు వంటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దినచర్యలతో బిజీగా ఉంటున్నామనే ఫాస్ట్‌ఫుడ్‌ను తీసుకొని అనారోగ్యాల బారిన పడొద్దన్నారు. మహిళలకు వంటిట్లో పురుషులు సాయం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ మహిళలు పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

తాజా కూరగాయలు, ఆకుకూరలతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. వంటల పోటీల్లో కొత్తపల్లి సెక్టార్ పరిధిలోని ఆసీఫ్‌నగర్-4 అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రథమ బహుమతి లభించింది. సురేశ్, వెన్నెల దంపతులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అరుణ, అంగన్‌వాడీ టీచర్ మెంగాని పద్మకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, సీడ బ్యాసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత, డీఈవో జనార్దన్‌రావు, పోషన్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ నాగరాజు, కరీంనగర్ రూరల్ సీడీపీవో సబిత, అర్బన్ సీడీపీవో లక్ష్మీనారాయణ, గంగాధర సీడీపీవో కస్తూరి పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

జిల్లాలో పలు చోట్ల ఆలయాల్లో ఉత్సవాలు





ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి, గంగాధర మండలం ఉప్పరమల్యాలలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, మార్చి 21: మండలంలోని చిన్న కోమటిపల్లిలో నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, భక్తులకు అన్న దానం చేశారు. రాత్రి గ్రామంలో స్వామి వారి రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు తెల్లవర్షుల ప్రదీప్ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ చిట్ల సరోజన, నాగన్న పాల్గొన్నారు.

● **గంగాధర:** మండలంలోని ఉప్పర మల్యాలలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముద్దం జమున నగేష్ దంపతులు, మాజీ సర్పంచ్ బొలాడి మంజుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● గర్షకుర్తిలో వేంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు.

సైదాపూర్: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు వేదమంత్రాల మధ్య కల్యాణం జరిపించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేరుకే ఆట స్థలాలు

ఇష్టారాజ్యంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటు



క్రీడా ప్రాంగణం మధ్యలో ఉన్న బావి



క్రీడా ప్రాంగణం పక్కన ఉన్న మరో బావి



బావి ఉన్న చోట ఏర్పాటు చేసిన ఎలబోతారం క్రీడా ప్రాంగణం బోర్డు

సైదాపూర్, మార్చి 21: మండలంలో అధికారులు ఇష్టారాజ్యంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, పై అధికారుల ఒత్తిడి మేరకు అప్పటి ప్రజాప్రతి నిధులు, అధికారులు ఏదో ఒక చోట బోర్డు పెట్టి బిల్లులు తీసుకొని చేతులుదులుపుకున్నారు. చాలా చోట్ల ఆటలకు ఉపయోగపడని స్థలాలను ఎంపిక చేశారు. ఎలబోతారంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం మధ్యలో బావి ఉంది. పక్కనే మరో బావి ఉంది. ఆ బావి పక్కనే వ్యాయామం చేసే పైపులు పాతారు. ఈ స్థలంలో ఆటలు ఎలా ఆడుతారని, బావుల పక్కన ఉన్న స్థలంలో ఆటలకు ఎలా ఉపయోగపడుతుందని ఆ గ్రామ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆట స్థలం మధ్యలో ఉన్న బావి పూడ్చి, పక్కన ఉన్న బావికి ఎత్తు కంచె నిర్మించాలని యువకులు కోరుతున్నారు. ఆరెపల్లి లో చెరువులో, జాగీర్‌పల్లిలో గుట్టమీద, సైదాపూర్‌లో గుండ్లు ఉన్న చోట, సోమారంలో మోడల్ స్కూల్ గ్రౌండ్‌కు క్రీడాప్రాంగణాల బోర్డులు పెట్టి వదిలేశారు.

మధ్యలో బావి ఉంటే ఆటలు ఎలా ఆడతారు

మారబోయిన ప్రవీణ్, ఎలబోతారం



గ్రామీణ క్రీడాకారులను పోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఆటలకు అనువుగాని చోట నిర్మించారు. ఎలబోతారంలో క్రీడా ప్రాంగణం మధ్యలో బావి ఉంది. మరో బావి సమీపంలో వ్యాయామం చేసే పైపులు పాతారు. ఇలాంటి చోట అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎలా క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారో తెలియడం లేదు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. క్రీడా ప్రాంగణాన్ని ఆటలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి.

రైతు వేదికల్లో కనీస సౌకర్యాలు కరువు



తిమ్మాపూర్, మార్చి 21: మండలంలోని రైతు వేదికల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తిమ్మాపూర్ మండల కేంద్రంతో పాటు నుస్తులాపూర్, పర్లపల్లి, రేణికుంట, మల్లాపూర్ గ్రామాలలో క్లస్టర్ల వారీగా ఐదు రైతు వేదికలు నిర్మించారు. పర్లపల్లి రైతు వేదికలో మాత్రమే నీటి వసతి ఉంది. తిమ్మాపూర్ రైతు వేదిక సమీపంలో ఓ రైతు పొలం నుంచి నీటిని అధికారులు వాడుకుంటున్నారు. రేణికుంట, మల్లాపూర్, నుస్తులాపూర్ గ్రామాలలో నిర్మించిన రైతు వేదికల్లో పైప లైన్ వేశారే తప్ప నీటి కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో వ్యవసాయాధికారులతోపాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు వేదికల వద్ద మిషన్ భగీరథ నీటి కోసం నల్ల కనెక్షన్‌ను తీసుకువచ్చి మధ్యలోనే నిలిపివేశారు. రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉండటంతో మహిళ రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● సిబ్బంది కొరత

మండల వ్యాప్తంగా సుమారు 12 వేల మంది రైతులు 23 వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. మండలంలో ముగ్గురు రెగ్యులర్, ఇద్దరు తాత్కాలిక విస్తరణ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటల పర్య వేక్షణకు, ఇతర పనుల మీద గ్రామలకు వెళితే రైతు వేది కల వద్దకు వచ్చిన రైతులు వారు వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. రైతు వేదికల వద్ద విస్తరణ అధికారులతోపాటు సహాయ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

నీటి వసతి లేక ఇబ్బందులు

నిర్వహణ ఖర్చులు మంజూరు చేయని ప్రభుత్వం

రైతు వేదికలు నిర్మించిన ప్రభుత్వం తగిన సిబ్బందిని నియమించలేదు. రైతు వేదికల నిర్వహణకు నిధులు మంజురు చేయకపోవడంతో వ్యవసాయ విస్తరణ అధికారులు తమ జేబులో నుంచి డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లులు కూడా విస్తరణ అధికారులే తమ జీతాల నుంచి చెల్లిస్తున్నారు.



నీటి సదుపాయం లేకపోవడంతో వృథాగా ఉన్న సింక్‌లు





తిమ్మాపూర్ రైతు వేదిక ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, నీటి ట్యాంక్

10వ తేదీలోగా

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 21: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ఏప్రిల్ 10లోగా పరిష్కరించాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజ మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం వారు మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. ఏప్రిల్ 10లోగా కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని నోటీసు ఇచ్చారు. మూడు నెలల నుంచి కార్మికులకు చీపురు డబ్బులు కూడా ఇవ్వలేదని, చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్లకు, ఆటోల మరమ్మతుల బిల్లులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల టైర్లు దెబ్బతిన్నాయని, కొత్త టైర్లు వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, పొన్నం లింగయ్య, ఎల్లయ్య, సమ్మయ్య, లచ్చయ్య, వెంకట్రాజం, సంపత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ సునీల్‌రావును కలిసి వినతిపత్రం అందజేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వరి పంటకు బోనస్ ప్రకటించాలి

హుజూరాబాద్‌రూరల్: వరి పంటకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే రూ. 500ల బోనస్ ప్రకటించాలని రాష్ట్ర కర్షక రైతు అభివృద్ధి సమితి నాయకులు కోరారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్‌కు రూ.2,203, బి గ్రేడ్‌కు రూ.2183 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, సాదులా అంశరెడ్డి, చల్లూరి సారయ్య, జక్కోజు ఆంజనే యులు, చల్లూరి ఆగయ్య, రూపిరెడ్డి మల్లారెడ్డి, గంగుల శ్రీనివాస్, రాజు, ఎర్ర రవీందర్ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో నీళ్ల లేక ఎండిపోయిన పంటలను మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ బండ శ్రీనివాస్ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంటనష్టం జరిగిన ప్రతి ఒక్క రైతుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పంట నష్టం కింద రూ.10వేలు అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండాల్‌రెడ్డి, రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

10లీటర్ల మద్యం పట్టివేత

సైదాపూర్, మార్చి 21: సైదాపూర్ మండల శివారులో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 10.980లీటర్ల మద్యం పట్టుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రాజయ్య అనే వ్యక్తి కాటన్ డబ్బాలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 9,900లు ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టు షాపులు నిర్వహించిన, డీజేలు నడిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, మార్చి 21: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గురువారం గ్రామస్థులు ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు. మానేరు వాగు నుంచి ప్రతినిత్యం అక్రమంగా ఇసుక తరలించడం వల్ల దుమ్ము, ధూళితో పాటు అతివేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకొని అక్రమ ఇసుకను అరికట్టాలని కోరుతున్నారు. రెండు గంటల పాటు ట్రాక్టర్‌లను ఆపారు.

మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మానకొండూర్, మార్చి 21 : మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి నర్సయ్య తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తికి అక్రమంగా ఇంటి నెంబరు కేటాయించారు. దీంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి పంచాయతీ కార్యదర్శిని రెండు రోజుల క్రితం సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

రూ.7,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,750 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 63మంది రైతులు 843క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,750, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుల అరెస్ట్

ముస్తాబాద్, మార్చి 21: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపుల నిర్వహిస్తున్న ఈడుగురాళ్ల రాజేశంగౌడ్ వద్ద 18,450 రూపాయలు, కొమిరె ఎల్లం వద్ద 9,060 రూపాయలు, ఈడుగురాళ్ల రామచంద్రం వద్ద 20,000 రూపాయల విలువైన మద్యంను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వేములవాడ, మార్చి 21: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొన్నం రవి అనే వ్యక్తి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉన్న కొంత నగదు అపహరణకు గురయ్యాయని రవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి చోరీ

సిరిసిల్ల క్రైం, మార్చి 21: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో పర్కాల శ్రీలక్ష్మి అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... పట్టణంలోని బీవైనగర్‌లో బుధవారం రాత్రి 10.30గంటలకు గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శ్రీలక్ష్మి అనే వృద్ధురాలిని నలుగురు వ్యక్తులు బెదిరించి తాళ్లతో కట్టేసి దోచుకున్నారు. ఆమె ఇంట్లో దాచిన ఆరువేల రూపాయలను, ఒక గ్రాము బంగారం, 12గ్రాముల వెండి నగలు ఎత్తుకొని వెళ్లారు. గురువారం ఉదయం పక్కింటివారు వచ్చి కట్లు విప్పేశారు. దీంతో బాధితురాలు శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు. నలుగురు నిందితులు ఏ వైపు నుంచి వచ్చారని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, మార్చి 21: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రామ్మోహన్ గురువారం తెలిపారు. మండలంలోని మల్లుపల్లె వాగు నుంచి ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లింగాపూర్ బస్ స్టేజి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చందుర్తి, మార్చి 21: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి బస్టాండ్ వద్ద బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ అనే వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


రాజమల్లయ్య(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 21: మండలంలోని ఆత్మనగర్ గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య అనే గీత కార్మికుడు ఆసపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువలు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 22న గ్రామంలోని తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. ప్రమాదంలో రాజమల్లయ్యకు రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చిలివేరి రాజమల్లయ్య గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ కరుణాకర్

వేములవాడ టౌన్, మార్చి 21: వేములవాడ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సీతమ్మ వారి పుస్తెమట్టెలు బుధవారం రాత్రి అపహరించుకుపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి సీతమ్మవారి మెడలోని పుస్తెమట్టెలు అపహరించడంతో పాటు హుండీని పగలగొట్టి డబ్బులను దొంగలించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 21 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనం నడుసుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన 14 మంది వ్యక్తులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మిగతా 13 మందికి 22 వేల రూపాయలు జరిమానావిధించినట్లు తెలిపారు.

వైభవంగా ధర్మపురి బ్రహ్మోత్సవాలు


ధర్మపురిలో కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకవస్తున్న కలెక్టర్


ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి ప్రభు త్వం పక్షాన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం క్షేత్రానికి చేరుకున్న కలె క్టర్, అధికారులకు ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా కలెక్టర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు నెత్తి మీద పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి చేతుల మీదుగా స్వామి వారలకు సమర్పించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చ కులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో కలెక్టర్‌కు స్వామి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తెలు, మట్టెలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, డీఎఫ్‌వో వేంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆమె కొద్ది సేపు విలేకరుల సమావే శంలో మాటాడారు. వసతుల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా స్వామి వారల ఎదుర్కోలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు ఆలయ అర్చకులు చిలుకముక్క అశ్విన్ ఇంటికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామి వారలను తీసుకవచ్చారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై ఆశీనులు చేసిన ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదుర్కోలు అనంతరం స్వామి వారల ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుక వెళ్లారు. ప్రధాన ఆలయం ఎదుట ధ్వజారోహణం నిర్వహించారు.

నిలిపిఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: గోదావరిఖని మంథని రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంద కిరణ్ అనే యువకుడు మృతి చెందాడు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన కిరణ్ తన మిత్రుడు రాకేష్‌తో కలసి ద్విచక్రవాహనంపై మంథనివైపు వెళ్తుండగా 3 ఇంక్లయిన్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బొగ్గు లారీని ఢీకొట్టాడు. తల భాగంలో బలమైన గాయాలు కావడంతో కిరణ్ అక్కడికక్కడే మరణించాడు. రాకేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతున్నాడు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట మండలంలో వేర్వేరు సంఘటనల్లో గురువారం ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు. విలాసాగర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. అదే విధంగా కోరపల్లి గ్రామానికి చెందిన వడ్నాల ఆశోక్ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా, అతడి వద్ద రూ.5వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: అదనపు కట్నం కావాలని అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన తాళ్లపల్లి ప్రవళికతో తాళ్లపల్లి అజయ్‌కుమార్‌కు 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రవళిక తల్లిదండ్రులు వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. కొంత కాలంగా అదనపు వరకట్నం పది లక్షలు కావాలని అత్తింటి వారు వేదిస్తున్నారంటూ ప్రవళిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. భర్త అజయ్ కుమార్, అత్త యశోద, మామ శ్రీహరి, మరిది విజయకుమార్, ఆడబిడ్డ రేష్మ, బైరెడ్డి శివసాయిలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

● విద్యార్థి సంఘాల ఆందోళన


విద్యార్థి పునీత్ వీపుపై గాయాలు

కోల్‌సిటీటౌన్, మార్చి 21: గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్‌లో 3వ తరగతి విద్యార్థి మేకల పునీత్‌ను టీచర్ చితకబాదింది. సైన్స్ సబ్జెక్టులో మార్కులు తక్కువ వచ్చాయని పునీత్‌ను బుధవారం టీచర్ కొట్టడంతో చేతులు, వీపు పైన వాతలు వచ్చాయి. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం పాఠశాలకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ విషయమై వాట్సాప్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యం లో విచారణ చేపట్టారు. విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. సేకరించిన వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని సతీష్ తెలిపారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 1089 ట్రోల్‌ఫీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో డేటాను సకాలంలో ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు


పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

● సిరిసిల్ల డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో కార్యక్రమాల అమలు తీరు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాజన్నసిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రాథమిక అరోగ్య కేంద్రాల వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బందికి హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన, డేటా శిక్షణను నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, రోగ నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ కేంద్రాల పనితీరు, ఇతర అంశాలపై ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహణ అధికారి సురేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. డేటా సేకరణతో పాటు సకాలంలో సక్రమంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమ, డీడీఎం కార్తీక్, ఏవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంవో బాలయ్య, డీఎస్‌వో పద్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ గంగయ్య, దయాకర్, శ్రీనివాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి రాజశేఖర్

గణేశ్‌నగర్,మార్చ్ 21: డిగ్రీ తర్వాత యువతకు విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రతిభ, నిరంతర కృషి, సూక్ష్మ పరిశీలన, ఆధ్యయన శీలత, క్రమశిక్షణ, వార్తా పత్రికల విశ్లేషణ, బృంద చర్చలు, ప్రణాళిక, లక్ష్యంతో కూడిన లోతైన విషయ అవగాహనతో ఉద్యోగ సాధన సాఫల్యం అవుతుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య బి రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్‌సైన్స్‌కళాశాల (అంతర్గత నైపుణ్యాల సాధన విభాగం) ఆధ్వర్యంలో కెరీర్ ప్లానింగ్‌పై నిర్వహించిన కార్యశాలలో ఆచార్య రాజశేఖర్ మాట్లాడారు. చదువు కేవలం డిగ్రీల కోసం కాకుండా ప్రతిభ, విషయ సాధికారత, ప్రజ్ఞా సామర్థ్యాల పెంపుదల దిశగా జరగాలన్నారు. నచ్చిన అంశాలలో విస్తృత అవకాశాలు ఆధునిక యుగంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్, ఐటీ రంగాలే కాకుండా జర్నలిజం, లలిత కళలు, వంటి ఎన్నో అవకాశాలు గ్లోబల్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఉన్న ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల నైపుణ్య వికాస కేంద్రంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, డా కే సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కే మల్లారెడ్డి, ఏ శ్రీనివాస్, ఎం అర్చన, వరప్రసాద్, శారద పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



బోర్నపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశావర్కర్లు ఇంటింటికి తిరుగుతూ కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించారు. లెప్రసీ నోడల్ పర్సన్ రమేష్, ఏఎన్‌ఎం వనిత, ఆశావర్కర్లు అరుణ, రమాదేవి, మున్సిపల్ వార్డు అధికారులు లత, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి



మాట్లాడుతున్న వీసీ సంకశాల మల్లేష్

● ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి21: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఆరోహణ 2024 స్టూడెంట్ మీట్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌యూ విసి ఆచార్య సంకశాల మల్లేష్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఏర్పాటు చేసిన శాతవాహన ఆరోహణ 2024 ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో కొవిడ్ తర్వాత ఒక మంచి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి, మార్కెట్‌కు సంబంధించిన వాటికి ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, ఇంటర్వ్యూ విధానంపై అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని వివరిం చారు. ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న వారిని గ్లోబల్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రాజశేఖర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్, డాక్టర్ ఈ మనోహర్, ఎంబీఏ ఫ్యాకల్టీ డాక్టర్ మనోజ్ కుమార్ , డాక్టర్ టి.కృష్ణకుమార్, కామర్స్ ఫ్యాకల్టీ డాక్టర్ కే తిరుపతి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లపై పోలీసుల దాడులు


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోనరావుపేట, మార్చి 21: మండలంలోని మల్కపేటలో బెల్ట్‌షాపులపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కోనరావుపేట ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి గురువారం దాడులు నిర్వహించారు. మల్కపేట గ్రామానికి చెందిన భోగి నాగరాజు, కుంట వెంకటి ఇంట్లో సోదాలు నిర్వహించగా సుమారు తొమ్మిది వేల రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు


తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు

ఎండపల్లి, మార్చి21; ఉపాధిహామీ కార్మికుల తవ్వకాలలో పురాతన విగ్రహాలు బయటపడ్డ సంఘటన మండలంలోని చెర్లపల్లి గ్రామంలో జరిగింది. కార్మికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ లాగే కార్మికులు గురువారం గ్రామంలోని ఎల్కల దేవి గుట్టకు కందకాలు తవ్వడానికి కూలీలు వెళ్లారు. పనిచేస్తుండగా 15 పురాతన విగ్రహాలు బయటపడగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని పూజలు నిర్వహించారు. విషయం సంబంధిత అధికారులకు తెల్పడంతో వారు విగ్రహాలను పరిశీ లించారు. విగ్రహాలు ఎప్పటివో తెలియడం కోసం పురావస్తుశాఖ వారికి సమాచారం ఇవ్వనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తిమ్మాపూర్‌లో యూనిసెఫ్ సెంట్రల్ టీం సందర్శన


తిమ్మాపూర్‌లో పరిశీలిస్తున్న యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు

తిమ్మాపూర్, మార్చి21: తిమ్మాపూర్ మండల కేంద్రంలో యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన కంపోస్ట్ స్టాల్, శానిటరీ సిబ్బంది మెటీరియల్ స్టాల్, శానిటరీ పరికరాల స్టాల్‌లను పరిశీలించారు. అంగన్వాడీలలో రిట్రో ఫిటింగ్ టాయిలెట్‌లను, విట మిన్ గార్డెన్‌లను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ప్రధామిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిభిరాన్ని బృందం సభ్యులు పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచ నలు చేసి పనులపై సంతృప్తి వ్యక్తం చేసి అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఢిల్లీ యూనిసెఫ్ కార్యాలయం నుంచి కౌశిక్ బెనర్జీ, అరలికట్టి వెంకటేష్ , మురళీకృష్ణ, కొండవీటి ఫనీంద్ర, ఎంపిడివో విజయ్ కుమార్, ఎంపివో కిరణ్ కుమార్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్ఎం

భగత్‌నగర్, మార్చి 21: కరీంనగర్ బస్టాండ్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని టాయిలెట్స్, లహరి ఏసీ బస్సులు, స్టాల్స్‌ను తనిఖీ చేశారు. డిప్యూటి రీజినల్ మేనేజర్స్ భూపతిరెడ్డి, సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు మల్లయ్య, మల్లేశం, కార్గో ఎటిఎం సదాశివ, బస్‌స్టేషన్ మేనేజర్ రజనీకృష్ణ పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మార్చి 21: ఎస్‌ఓఎఫ్ అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రతి వారానికి ఒకసారి సైన్స్ అంశాల పట్ల అవగాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ దశల్లో పోటీ పరీక్షలు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. ఎస్‌ఓఎఫ్ వారు నిర్వహించిన అంతర్జాతీయ ఒలంపియాడ్‌లో పాఠశాలకు చెందిన హవిష్ తేజ, ఎ విహాన్ కృష్ణ, మెహర్, జోయల్ డేవిస్, చంద్రహాస్, శివస్మరన్, సాయి హర్షిత్‌లు బంగారు పతకాలు సాధించారన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన సుడా చైర్మన్



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి21: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్‌గా నియామకమైన తరువాత మొదటిసారిగా సీఎం రేవంత్ రెడ్డిని గురువారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో సీఎంను కలిసిన నరేందర్‌రెడ్డి పూలగుచ్ఛం అందించి, సుడా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కోడ్ ముగిసిన తరువాత సుడా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. సుడా చైర్మన్‌గా నియామకమైన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బండి సంజయ్ ప్రజాహిత యాత్రకు విశేష స్పందన



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్ టౌన్, మార్చి 21: ఎంపీ బండి సంజయ్‌కుమార్ 30 రోజులపాటు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన ప్రజాహిత యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన పొన్నం ప్రభాకర్, బండి సంజయ్‌కుమార్‌కు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుడు గంగుల కమలాకర్‌తో మిలాఖతై కరీంనగర్‌లో పోటీచేస్తే మూడోస్థానం తప్పదని పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు పారిపోయాడని విమర్శించారు. కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీతో మంత్రుల మధ్య విభేధాలు అప్పుడే బహిర్గతమయ్యాయన్నారు. ముందు మీ పార్టీని చక్కదిద్దుకోవాలని, దేశంలో వచ్చేది బీజేపీయేనని ధీమా వ్యక్త ంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాజేంద్రప్రసాద్, బాస సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, నాయకులు కొలగాని శ్రీనివాస్, రాపర్తి ప్రసాద్, అనూప్‌కుమార్, బండ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా తప్పదు

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ 120మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలో యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడినట్లయితే రూ.5వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా ఉంటుందన్నారు. దుకాణదారులు, చిరువ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, వినియోగదారులకు ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

హుజూరాబాద్ హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ పట్టణంలోని శ్రీహనుమాన్ దేవాలయ హుండీ ఆదాయం రూ.46,538 వచ్చినట్లు ఆలయ ఈవో సుధాకర్ తెలిపారు. గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి సత్యనారాయణ సమక్షంలో హుండీ లెక్కించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు భాస్కర్‌శర్మ, సురేందర్‌శర్మ,సిబ్బంది లోకేష్, అశోక్, కొండాల్‌రెడ్డి, స్వరూప, సారయ్య ఉన్నారు.

'రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ'

హుజూరాబాద్, మార్చి 21: కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని టీపీసీసీ ఎస్సీసెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రాహుల్‌గాంధీ దేశవ్యాప్త రైతు రుణమాఫీ ప్రకటించగానే ఇతర పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టినటువంటి సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రతి ఇంటికి చేరుతున్నాయో అదేవిధంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించబోయేటువంటి మేనిఫెస్టోలో పథలకాలన్నీ అమలవుతాయన్నారు. ఈసారి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సందమల్ల నరేష్, సందమల్ల బాబు, దుబాసి బాబు, బత్తిని రవీందర్‌గౌడ్, జంగ అనిల్, తిరుపతి, ముక్క రమేష్ పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం.

రామడుగు, మార్చి 21 : రామడుగు మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కలిగేటి కవిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఐదుగురు ఎంపీటీసీలతో పాటు కో-ఆప్షన్ సభ్యులు రజబ్‌అలీ హాజరయ్యారు. జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయి అధికారులు హాజరు కాకపోవడమే కాకుండా అధికారులు నివేదిక చదివి వినిపించగా సభ్యులు ఒకటి, రెండు మినహా సమస్యలపై ప్రస్తావించకపోవడంతో అధికారులు సభ ముగిసినట్లు ప్రకటించారు. ఎంపీడివో రాజేశ్వరీ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దు

● కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు

తిమ్మాపూర్, మార్చి21: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంటకరమణ అన్నారు. స్థానిక వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు ఎల్ఎండీ పోలీసుల ఆధ్వర్యం లో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలు ఆపద సమయంలో 100నెంబరుకు గానీ, జిల్లా షీటీం నెంబరు 8712670759కు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్ర మంలో షీటీం సీఐ శ్రీలత, తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎల్ఎండీ ఎస్సై చేరాలు, వాగేశ్వరి కళాశాల జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబ్ధ కాలుష్యాన్ని పెంచే సైలెన్సర్లను బిగిస్తే చర్యలు



బైక్ మెకానిక్‌లతో మాట్లాడుతున్న సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, మార్చి 21: శబ్ధ కాలుష్యాన్ని పెంచే సైలెన్సర్లను వాహనాలకు బిగిస్తే వాహన యజమానులతో పాటు బైక్ మెకానిక్‌లపై చర్యలు తీసుకుంటామని సీఐలు హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆదేశాలతో గురువారం కరీంనగర్ టౌన్ డివిజన్‌లోని 1, 2, 3టౌన్‌ల పరిధిలో బైక్ మెకానిక్‌లకు శబ్ధ కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐలు సరిలాల్, విజయ్‌కుమార్, రవిలు మాట్లాడుతూ కరీంనగర్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్వహించిన తనిఖీలలో యువకులు బైక్‌ల సైలెన్సర్‌లను మార్చి ఎక్కువ శబ్ధం వచ్చే వాటిని బిగించుకుని శబ్ధ కాలుష్యానికి పాల్పడుతున్నట్లు వెల్లడైందన్నారు. ఈ చర్యలను నియంత్రించేందుకు మొదట బైక్ మెకానిక్‌లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బైక్ మెకానిక్‌లు సైలెన్సర్‌లు మార్చవద్దని సూచించారు. శబ్ధ కాలుష్యానికి కారణమైన సైలెన్సర్‌లను విక్రయించే వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా మెకానిక్‌ల వద్దకు వచ్చిన వాహనాలకు నెంబరుప్లేట్‌ను బిగించాలని సీఐలు అన్నారు. అనుమానిత బైక్‌లకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించాల న్నారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో సీఐలు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు గృహజ్యోతి వర్తింపజేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 21: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేసి జీరో విద్యుత్ బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల పక్షాన సంఘ నాయకుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం పాఠశాలలకు ఇచ్చే అత్తెసరు నిధులతో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయని, దీనితో కరెంట్ కట్ చేస్తే టీచర్లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

'ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన ప్రవీణ్‌కుమార్'



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 21: బహుజనుల ఆత్మగౌరవాన్ని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తాకట్టు పెట్టారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ సమ్మయ్య, కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ భారతదేశంలోనే గొప్ప సిద్ధాంతం కలిగిన పార్టీ అని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వెంట కార్యకర్తలు ఎవ్వరు వెళ్ళలేదని తెలిపారు. పార్టీ అధినాయకత్వం ఎంతో నమ్మకంతో ఆయనకు రాష్ట్ర అధ్యక్షపదవి ఇస్తే బహుజన వాదాన్ని దొరల గడీలకు తాకట్టు పెట్టారని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు అభ్యర్థులను నిలుపుతామని తెలిపారు. బీఎస్పీని ప్రజలు ఎప్పటిలాగానే ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జీ మంద బాలయ్య, ప్రధానకార్యదర్శి మాంకాళి మల్లేశం, బావండ్ల ఎల్లయ్య, ఆరెపెల్లి వినోద్, వాసాల భానుచందర్, పొత్తూరి సురేష్, బందరకంటి సామెల్, కుమ్మరి సంతోష్, గుడిసె ప్రభాకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గీతామందిర వార్షికోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 21: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిర సన్యాసమఠంలో మఠాధిపతి విష్ణుసేవానంద గిరిస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు గురువారంతో ముగిసాయి. జప, ధ్యానములు, అభిషేకాలు, సకల దేవతా హోమాలు, పూజలు, భజనలు, సంకీర్తనలు, భగవద్గీత, వివిధ దేవతల పారాయణాలు జరిగాయి. స్వామీజీల ఆశీర్వచన భాషణం, పూర్ణాహుతి, అవబృథ జలప్రోక్షణ, ధ్వజావరోహణంతో ఉత్సవాలు పూర్తయ్యాయి. హైదరాబాద్ లలితాంబికా పీఠాధిపతి సంపూర్ణానందగిరిస్వామి అధ్యక్షతన తనతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన విష్ణుసేవా నందగిరిస్వామి, సచ్చిదానందగిరిస్వామి, శుద్ధ బ్రహ్మానందగిరిస్వామి, రామచైతన్య స్వామి, సనకసనంద సరస్వతీస్వామి, చిదానంద గిరిస్వామి, ఆత్మానందగిరిస్వామి, భక్త రాజేశం గురువు ఆధ్యాత్మిక ఆశీర్వచన భాషణం చేశారు. కార్యక్రమంలో విష్ణుమూర్తిశర్మ, రామచంద్రశర్మపాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో లక్ష్మీనారాయణ

కరీంనగర్ రూరల్, మార్చి 21: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో లక్ష్మీనారాయణ అన్నారు. కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో గురువారం ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతిరోజు గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి ద్వారా అందించే ఆహారాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వివో సభ్యులు అంగన్‌వాడీ టీచర్లు రమణ, పద్మ, వెంకటలక్ష్మి, జయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా'



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి21: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని బీఆర్ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గురువారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే మైదానంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు, ఇతర నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ వాకర్స్, మహిళలతో వినోద్‌కుమార్ ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఎంపీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్ అభివృద్ధికి నిధులు తీసుకురాలేదని అన్నారు. తాను 2014 నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు వేయి కోట్లతో స్మార్ట్‌సిటీ తీసుకు రావడంతో నగర రూపురేఖలు ఏవిధంగా మారాయో మీరే చూస్తున్నారని అన్నారు. కరీంనగర్‌లో ఐటీ టవర్, ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు కార్పొరేట్ ఉద్యోగాలకు కృషిచేశానన్నారు. కరీంనగర్ చుట్టు పక్కల నాలుగు జాతీయ రహదారుల కోసం పార్లమెంట్‌లో గళమెత్తానని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసి చూపిస్తానని వినోద్‌కుమార్ ప్రజలకు హామీ ఇచ్చారు. కరీంనగర్‌ను విద్యాహబ్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని అన్నారు. అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడం చేతగాకనే సంజయ్ గాలి మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు.

మోదీతోనే దేశాభివృద్ధి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



సింగాపూర్‌లో కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్‌రూరల్, మార్చి 21 : మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. లాబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సంపూర్ణంగా అవగాహన కల్పిస్తూ బీజేపీకి మద్దతు పలకాలని ప్రచారం నిర్వహించారు. ప్రధానిగా మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన నుంచి నేటి వరకు భారతదేశంలో సమగ్ర మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా పేదలు, యువత, రైతులు, మహిళలు అభివృద్ధి చెందే విధంగా బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆత్మ నిర్బర్‌భారత్, వికసిత్ భారత్ లక్ష్యంగా విశ్వ గురువుగా దేశాన్ని మార్చడానికి మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. మళ్లీ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీవినీ ఎరుగని అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాముల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పారిపెల్లి కొండాల్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పథకాల నారాయణరెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జీ మేడవేణి కుమార్, 17వ బూత్ అధ్యక్షుడు కేశవేణి మోహన్, నాయకులు ముష్కర ప్రదీప్, కొండా రఘువర్మ తదితరులు ఉన్నారు.

కేటీఆర్, గంగులతో మంత్రి పొన్నంకు దోస్తీ

● బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

చిగురుమామిడి, మార్చి 21: కరీంనగర్ నియోజకవర్గ ప్రజలు తరిమితే హుస్నాబాద్‌కు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాజీ మంత్రులు కేటీఆర్, గంగులతో స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి అన్నారు. గురువారం మండలంలోని బొమ్మనపల్లి- ఉల్లంపల్లి గ్రామాల సరిహద్దులో ఉన్న మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజక వర్గాలు మార్చే వ్యక్తి పొన్నం ప్రభాకర్ లాగా బండి సంజయ్ ఓడినా గెలిచినా కరీంనగర్‌లోనే ఉన్నాడని, ఇతర ప్రాంతాలకు వెళ్లలేదన్నారు. బీజేపీలో జాతీయ స్థాయికి ఎదిగిన బండి సంజయ్ మచ్చలేని నాయకుడని రానున్న ఎన్నికల్లో రెండవ సారి ఎంపీగా విజయం సాధించబోతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి పొన్నం అధికారులను బెదిరిస్తున్నారని అన్నారు. మంత్రిగా గెలిచిన నుంచి నియోజకవర్గంలో ఏనాడూ పూర్తిగా ఉన్న దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గ ప్రజలు మంత్రి తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు.

చొప్పదండి అభివృద్ధికి కృషి : మంత్రి పొన్నం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

చొప్పదండి, మార్చి 21: చొప్పదండి మండల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రావాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ధర్మపురి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వెళుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గమధ్యలో చొప్పదండి, రుక్మాపూర్‌లో ఆగి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొప్పదండి మండల అభివృద్ధికి కృషి చేస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, ముద్దసాని రంగన్న, పెరుమాండ్ల గంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



రేకొండలో పోషణ్ పక్వాడ కార్యక్రమం

చిగురుమామిడి,మార్చి 21: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీ పోషకాహారాన్ని విధిగా తీసుకుని తల్లీబిడ్డలు క్షేమంగా ఉండాలని ఐసీడీఎస్ సపర్‌వైజర్ ఇందిరా అన్నారు. మండలంలోని రేకొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణిలకు శ్రీమంతం చేసి ఆశీర్వదించారు. బాలింతలను, చంటి పిల్లలను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బిడ్డతల్లి క్షేమంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రతి కార్యక్రమాన్ని వినియోగించుకోలన్నారు. ప్రతి తల్లి ప్రసవం అయిన వెంటనే ముర్రు పాలు తప్పకుండా బిడ్డకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అశ వర్కర్లు పాల్గొన్నారు.

శంకరపట్నం : పురుషులు కూడా పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో సబిత అన్నారు. గురువారం శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సబిత మాట్లాడుతూ కుటుంబంలో వంటలు చేయడం, పిల్లల పెంపకం మహిళలది మాత్రమే కాదని, పురుషులు ప్రతి విషయంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పురుషులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధాన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, ఆయుష్ డాక్టర్ సంధ్య, అంగన్‌వాడీ టీచర్స్ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి21: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. గౌతమినగర్, తిరుమల నగర్, కోతిరంపూర్, కోతిరాంపూర్, భవానీనగర్, శ్రీనివాస్ నగర్, ప్రొఫెసర్ నగర్ దుర్గాదేవి నగర్, లక్ష్మీనగర్, కాకతీయ స్కూల్ ఏరియా, బ్రాహ్మణ వీధి, న్యూ శ్రీనగర్ కాలనీ, గౌతమి నగర్, ఫకీర్ వాడ, కట్ట రాంపూర్, వివిధ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి'

కరీంనగర్ అర్బన్, మార్చి 21: నామినేటెడ్ పదవుల్లో మైనార్టీ నాయకుడినైన తనకు అవకాశం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సిరాజ్ హుస్సేన్ గురువారం హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సీఎం నివాసంలో కలిసి తన బయోడేటాను అందజేశానని సిరాజ్ హుస్సేన్ తెలిపారు. గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని వీడకుండా వివిధ హోదాల్లో పార్టీకి విధేయుడుగా పనిచేస్తున్న తనకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పార్టీ కోసం పనిచేస్తే గుర్తింపు

కరీంనగర్ టౌన్, మార్చి 21: పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన వారికి తెలుగుదేశం పార్టీ అధిష్టానం గుర్తింపునిచ్చి తగిన పదవులను కట్టబెడుతుందని టిడిపి కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి కళ్యాడపు ఆగయ్య, పార్లమెంట్ అధ్యక్షుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ రాష్ట్ర వాణిజ్యసెల్ కార్యనిర్వహణ కార్యదర్శులుగా నియమితులైన ఎలిమిల్ల కిషన్, ఇట్ట మల్లేశంను ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం పనిచేసిన వీరిని గుర్తించి పదవులు ఇవ్వడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశం, రొడ్డ శ్రీదర్, లక్ష్మన్, నరేందర్, దత్తు, సీతయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కరీంనగర్‌రూరల్, మార్చి 21: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొద్దిరోజులుగా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయన్నారు. సాగునీరు లేక రైతులు రోడ్డెక్కె పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కీర్తి పురస్కారం అందుకున్న మాడిశెట్టి గోపాల్

కరీంనగర్ కల్చరల్, మార్చి 21: వివిధ ప్రక్రియల్లో కృషికి గాను తెలుగు విశ్వవిద్యాలయం ఇచ్చే కీర్తి పురస్కారాల్లో భాగంగా గురువారం జిల్లాకు చెందిన రచయిత, వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్ సాంస్కృతిక సంస్థల నిర్వహణ విభాగంలో కీర్తి పురస్కారాన్ని హైదరాబాద్‌లో అందుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జుడీషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్ (జింబో)తో పాటు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రామమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ చేతుల మీదుగా 5 వేల రూపాయల నగదు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు గోపాల్‌కు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

కరీంనగర్ రూరల్, మార్చి 21: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వి పరబ్రహ్మమూర్తి గురువారం గుండెపోటుతో మరణించాడు. గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు సంతాపం ప్రకటించారు.

చివరి ఆయకట్టుకు నీటి విడుదల

వీణవంక,మార్చి21: మండలంలోని చివరి ఆయకట్టుకు వ్యవసాయ పొలాలకు నీటిని విడుదల చేశారు. మండలంలోని వీణవంక, లస్మక్కపల్లి, బ్రహ్మణపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల రైతులు తమ పంట పొలాలకు చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు రైతులు విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు.

అన్నారంలో మంచినీటి కటకట

మానకొండూర్, మార్చి 21 : మండలంలోని అన్నారం గ్రామంలో నాలుగు రోజులు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు వ్యవసాయబావులపై ఆధారపడుతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని, మరమ్మతుపనులు చేపట్టినట్లు ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

గంగాధర: సమతుల ఆహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఏసిడిపివో సౌందర్య అన్నారు. గురువారం గంగాధర మండలం కాసారం, సర్వారెడ్డిపల్లిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణీలు ఐరెన్ ఫుడ్‌తో పాటు చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు.

ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

జమ్మికుంట రూరల్, మార్చి 21: సాంఘిక, గిరిజన సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

జమ్మికుంట, మార్చి 21: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం అయిన నాగారి ప్రీతంను హైదరాబాద్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గూడెపు సారంగపాణి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నాయకులు మైస మహేందర్ ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు సెమినార్

వీణవంక,మార్చి21: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు స్పీకర్ నాగేంద్ర అధ్వర్యంలో భవిష్యత్తు తరగుతులపై సలహాలు, సూచనలు మోటి వేషన్ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎల్‌వో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, కెజీబీవి స్పెషల్ అఫీసర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చెల్పూర్‌లో నాగుపాము హల్‌చల్

హుజూరాబాద్‌రూరల్, మార్చి 21 : మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఓ నాగు పాము గురువారం హల్‌చల్ సృష్టించింది. గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ పైపులో నాగుపాము దూరింది. గ్రామపంచాయతీ కార్మికుడు నిజానపురం సంపత్ నాగుపామును బయటకు తీశాడు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిత్య హోమం

రామడుగు, మార్చి 21: వెలిశాలలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆలయంలో నిత్య హోమం, విశేషసంఘ సుదర్శన, నర్సింగ్ హోమం, బలిహరణ, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల సరోజన, వీర్ల ప్రభాకర్‌రావు, డైరెక్టర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.